క్లుప్తంగా

కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు

తాడేపల్లిరూరల్: 75 రోజుల నుంచి ఏసీసీ కార్మికులు దీక్షలు చేసున్నా వారి సమస్యలు పరిష్కరించకపోవడం విచారకరమని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. గురువారం బ్రహ్మానంద పురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యను పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం, యాజమాన్యానికి అనుకూలంగా మాట్లాడడం సరైన పద్ధతి కాదన్నారు. సత్వరమే కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు, స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, ఆ హామీని ఆయన నిలబెట్టుకోవాలని అన్నారు. ఈ దీక్షలలో అగ్గయ్య, వల్లెపు బుజ్జి, ఉదయగిరి రమణ, వేముల రోజా, వేముల లక్ష్మి కూర్చొనగా, దీక్షలకు మద్దతుగా కె.స్టీవెన్, సూర్యప్రకాష్, అంకయ్య, యెహోషువ, ఆశీర్వాదం, ఇశ్రాయేలు, టి.నాగేశ్వరరావు, సుబ్బారావు, సుభాని, శారమ్మ, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

210 మందికి వైద్యపరీక్షలు



ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. 210 మందికి షుగర్, బీపీ, థైరాయిడ్ వంటి పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. ఎంఎల్ హెచ్‌పీ స్వప్న, ఏఎన్ఎం ఆంథోనిరాణి, ఆశాకార్యకర్తలు సుజాత, పద్మ, శాంతరాణి, శాంతకుమారి, జోజమ్మలుపాల్గొన్నారు.

ఆశా రికార్డుల పరిశీలన..

మండలంలోని వేములూరిపాడు గ్రామంలో మలేరియా సత్తెనపల్లి సబ్ యూనిట్ అధికారి ఆశా కార్యకర్తల రికార్డులు పరిశీలించారు. ఫ్రైడే- డ్రైడే లో భాగంగా ఇంటింటికి వెళ్లి వివరాల నమోదు రికార్డులు తనిఖీ చేశారు. ఫీల్డు రిజిస్టర్లు పరిశీలించి కొత్త రిజిష్టర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట మేల్ హెల్త్ అసిస్టెంట్ బాబురావు ఉన్నారు.

నేడు తహసీల్దార్ కార్యాలయంలో అర్జీల అందజేత

మంగళగిరి (తాడేపల్లిరూరల్): నిరుపేదలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలాలు ఇవ్వాలని నేడు తహసీల్దార్ కార్యాలయం వద్ద అర్జీలు అందజేయనున్నట్లు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య అన్నారు. గురువారం మంగళగిరి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం పేదలకు ఇళ్ల స్థలాలతోపాటు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, పేద ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పార్టీ రాష్ట్రశాఖ పిలుపు మేరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్జీలను అందజేయడం జరిగిందని, ఆ అర్జీలను లబ్ధిదారులతో కలసి మంగళగిరి తహశీల్దార్‌కు అందజేయడంజరుగుతుందని ఆయన అన్నారు. పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు, మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన



తాడికొండ: మండల కేంద్రమైన తాడికొండలో గురువారం రూ.34 లక్షలతో నిర్మించనున్న రెండు సీసీ రోడ్లకు ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ శంకుస్థాపన నిర్వహించారు. పాత సినిమా హాలు రోడ్డు, తూర్పు వీధి ముస్లిం బజారులో సీసీ రోడ్లను మండల పరిషత్ నిధులతో నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అవసరమైతే ఎంపీ నిధుల నుంచి ఖర్చుచేసి అవసరాల మేరకు పనులు చేస్తామన్నారు. సర్పంచ్ తోకల సరోజినీ, పలువురు టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గర్భిణులు తగిన జాగ్రత్తలు పాటించాలి

ఫిరంగిపురం: రక్తహీనత లేకుండా గర్భిణులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యురాలు శ్వేత అన్నారు. మండలకేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వయోజన ద్వారా పలు గ్రామాల నుంచి వచ్చిన 32మంది గర్భిణులకు పలు రకాల ఆరోగ్యపరీక్షలు చేశారు. బ్లడ్ షుగర్, బ్లడ్ గ్రూపింగ్, ఆర్‌హెచ్ టైపింగ్, హెచ్ఐవీ పరీక్షలు చేశారు. ఈసందర్భంగా వారికి పోషక విలువలతో కూడిన ఆహారంతీసుకోవడం ద్వారా బిడ్డ ఎదుగుదల బాగుంటుందని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఏఎన్ఎం సుశీల, లావణ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కట్ట దొరకడమూ కష్టమే..!

సొసైటీల్లో తీవ్రంగా ఎరువుల కొరత

- ప్రతిరోజూ కాళ్లరిగేలా తిరుగుతున్న రైతులు
- ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు
- పలుకుబడి ఉన్నవారికే దక్కుతున్న వైనం



పెదపాలెం సొసైటీ వద్ద ఎరువుల కోసం నిరీక్షిస్తున్న రైతులు



దుగ్గిరాల సొసైటీ వద్ద డీఏపీ కట్టల కోసం ఎదురు చూస్తున్న రైతులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గంలో రైతులు అన్నిరకాల పంటలను పండిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 38 వేల హెక్టార్లలో వరి, మినుము, జొన్న, పసుపు, కంద, చేమ ఇతర కూరగాయలు, పూలు, వాణిజ్య పంటలు సాగవుతున్నాయి. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో అల్పపీడనాలు, వర్షాల వల్ల రైతులు నష్టాన్ని చవిచూశారు. వరి పండించే రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. నియోజకవర్గవ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 10 వేల ఎకరాల వరకు వరిసాగు చేశారు. వర్షాల వల్ల పంట దెబ్బతినడం, పంట చేతికి వచ్చిన సమయంలో ధాన్యం తడవడం, ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు నష్టపోయారు. ఆ రైతులు తమ పొలాల్లో నష్టాలనుండి బయట పడేందుకు మొక్కజొన్న, జొన్న, మినుము, తదితర పంటలను వేశారు. అయితే ఇప్పుడు వాటికి బలం మందులు వేసేందుకు యూరియాతో పాటు డీఏపీ అవసరం.

పలుకుబడి ఉంటేనే ..

మంగళగిరి నియోజకవర్గవ్యాప్తంగా 6 సొసైటీలు ఉన్నాయి. అందులో ఒక సొసైటీని పూర్తిగా మూసివేశారు. ఆ సొసైటీల్లో రైతులకు అవసరమైన డీఏపీ లేకపోవడంతో రైతులు చెప్పులరిగేలా సొసైటీల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఒక ఎకరానికి మొట్ట మొదటగా యూరియా బస్తాతో పాటు ఒక డీఏపీ కట్టతో కలిపి పొలాల్లో చల్లుతారు. యూరియా దొరుకుతోంది కానీ డీఏపీ దొరకడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏ సొసైటీ వద్ద చూసినా రైతులు క్యూ కట్టి ఎదురు చూస్తున్నారు. వచ్చిన డీఏపీ కట్టలను రాజకీయ పలుకుబడి వున్న పెద్దపెద్ద రైతులు సొసైటీకి రాకుండా ఆ బస్తాలను తమ వాహనాల్లో తీసుకువెళుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజకీయ పలుకుబడి ఉంటే ఏ ప్రాంతంలో అయినా ఏ సొసైటీలో అయినా ఆ మోతుబరి రైతుకు ఎరువులు అందుతున్నాయని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఇదిగో అదిగో అంటున్నారు..



సొసైటీల్లో డీఏపీ దొరకడం లేదు, అధికారులు మాత్రం ఇదిగో వస్తోంది అదిగో వస్తోందంటున్నారు. వరి పంట వేసి నష్టపోయాం. ఈ సీజన్‌లో అయినా పంట బాగా పండించి ఉన్న అప్పులు తీర్చుకుందామనుకునే సమయంలో అవసరమైన ఎరువులు అందకపోతే మరోసారి నష్టాలు చూడాల్సి వస్తుంది. మా సొసైటీలో మాకే ఎరువులు ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– తురిమెళ్ల జయరామకృష్ణ, రైతు, దుగ్గిరాల

నాలుగు రోజుల నుంచి తిరుగుతున్నాను..



సొసైటీలో ఇప్పటి వరకు డీఏపీ ఎరువులు అందుబాటులోకి రాలేదు. వస్తున్నాయి.. కానీ అయిపోయాయని అధికారులు చెబుతున్నారు. నాలుగు రోజుల నుంచి ప్రతిరోజూ దుగ్గిరాల వస్తున్నా. ఒక్క కట్ట కూడా డీఏపీ దొరకలేదు. ఏ మండలంలో వున్న సొసైటీ ఆ మండలంలోని రైతులకు ఎరువులు అందజేయాలి. ఇతర మండలాలనుంచి వచ్చి తమ పలుకుబడితో ఎరువులు తీసుకువెళుతున్నారు. దీంతో చిన్న రైతులు ఇబ్బంది పడుతున్నారు.

– ఏమినేని రవీంద్ర, రైతు, మంచికలపూడి

డీఏపీ దొరకడం లేదు..



మొక్కజొన్న ఎదుగుదలకు యూరియా బలానికి డీఏపీ అవసరం. 20 రోజుల మొక్క దగ్గర నుంచి యూరియా, డీఏపీ ఉపయోగిస్తేనే మొక్క బాగా పెరుగుతుంది. ఒక ఎకరానికి 4 డీఏపీ కట్టలు పడతాయి. నాలుగు రోజుల నుంచి నూతక్కి సొసైటీ చుట్టూ తిరుగుతున్నా దొరకడం లేదు. మిగతావి అధికారులు కావల్సినన్ని ఇస్తున్నారు. మన ప్రాంతంలో డీఏపీ ఎక్కువ ఉపయోగిస్తారు.

– సురేష్, రైతు, చిర్రావూరు

క్లాప్ డ్రైవర్ల ఆందోళన ఉధృతం


మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి ఎంటీఎంసీ కార్యాలయం వద్ద క్లాప్ డ్రైవర్లు నిర్వహిస్తున్న సమ్మెను గురువారం సీఐటీయూ గుంటూరు జిల్లా నాయకుడు ఎం. రవి ప్రారంభించి మాట్లాడారు. ఎంటీఎంసీ క్లాప్ డ్రైవర్లకు రెండు నెలల నుంచి జీతాలు చెల్లించకపోతే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయో అధికారులు ఆలోచించాలన్నారు. క్లాప్ డ్రైవర్లకు జీతాలు చెల్లించకుండా ఏజెన్సీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటే అధికారులు ఏజెన్సీపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు టన్నుల కొద్దీ చెత్తను పట్టణం నుంచి బయటకు తరలిస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లకు జీతాలు చెల్లించే విషయంలో అధికార యంత్రాంగం, ఏజెన్సీలు సాకులు చెప్పడం సరకాదని అన్నారు. ఎంటీఎంసీ క్లాప్ డ్రైవర్ల న్యాయమైన ఆందోళనకు సీఐటీయూ గుంటూరు జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందని అన్నారు. సీఐటీయూ పట్టణ నాయకుడు వీసం జవహర్‌లాల్ మాట్లాడుతూ క్లాప్ డ్రైవర్లు గత ఏడు రోజుల నుంచి సమ్మె చేస్తున్న నేపధ్యంలో స్థానిక శాసన సభ్యుడు, మంత్రి నారా లోకేష్, మున్సిపల్ మంత్రి నారాయణలు స్పందించి డ్రైవర్ల సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నామన్నారు. సీఐటీయూ నాయకుడు జెవి రాఘవులు మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర కోసం పట్టణాల్లో వేస్టేజీనంతా టన్నుల కొద్దీ బయటకు తరలిస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ, క్లాప్ ఆటోడ్రైవర్ల యూనియన్ నాయకులు శివ, రవి తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన నిర్వహిస్తున్న క్లాప్ డ్రైవర్లు

తొక్కిసలాటకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

- గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలి
- కూటమి నాయకుల అత్యుత్సాహమే ఈ ప్రమాదానికి కారణం
- వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



తాడేపల్లిరూరల్: తిరుమల తిరుపతి దేవస్థానంలో ముందెన్నడూ జరగని విధంగా తొక్కిసలాట జరిగి భక్తులు ప్రాణాలు కోల్పోయారు. కూటమి ప్రభుత్వమే దీనికి బాధ్యత వహించాలని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. గురువారం మంగళగిరి రూరల్ ఆత్మకూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానంలో ఇంతకు ముందెన్నడూ జరగని సంఘటన చోటుచేసుకుంటున్నాయని దేవస్థానం రాజకీయాలకు కేంద్రంగా మారిందని, కూటమి నాయకులు ప్రోటోకాల్ పేరుతో సామాన్య భక్తులను ఇబ్బందులకు గురిచేయడం, వైకుంఠ ఏకాదశి టిక్కెట్ల కోసం ఒక్కసారిగా వదలడం వల్ల ఈ ప్రమాదం చోటుచేసుకుందని, అధికారికంగా ఆరుగురు మరణించారని చెబుతున్నా ఆ సంఖ్య పెరిగే అవకాశం ఉందని, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బాధితులను పరామర్శించడానికి వెళుతున్నారన్న విషయం తెలియగానే కూటమి నాయకులు స్పందించారని, మృతి చెందినవారికి ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియాను వెంటనే అందజేయాలని, గాయపడిన వారికి నష్టపరిహారం చెల్లించడంతో పాటు వారికి మెరుగైన వైద్యం అందించాలని అన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తిరుమలలో శాశ్వతంగా ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



ఇంటెల్ హైస్కూల్‌లో భోగి మంట చుట్టూ విద్యార్థులు

మేడికొండూరు: తెలుగు సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందించాలని ఇంటెల్ హైస్కూల్ డైరెక్టర్ డాక్టర్ కోనూరి జయకుమార్ అన్నారు. మండలంలోని పేరేచర్ల ఇంటెల్ హైస్కూల్లో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు సాంప్రదాయాలకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉన్నదన్నారు. సాంప్రదాయాలు ఉట్టిపడేలా విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ప్రత్యేక పండుగ ముగ్గుల పోటీలు నిర్వహించారు. చిన్నారులు హరిదాసుల వేషధారణలో ప్రత్యేకంగా ఆకట్టుకున్నారు. భోగి మంటలు వేసి, భోగి పళ్ళు పోశారు. అనంతరం గాలిపటాలను ఎగరవేశారు. సంక్రాంతి పండుగ ఉట్టిపడేలా ప్రత్యేక పాటలరూపంలో నృత్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలు రకాల ఆటలు పోటీలు నిర్వహించి వాటిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ కోనూరి రాణి జయ కుమార్, పలువురు అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన ప్రైవేటు బస్సు

కారులోని వ్యక్తికి త్రుటిలో తప్పిన ముప్పు

తాడికొండ: ప్రైవేటు బస్సు ఢీకొని కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమై వాహనం నడుపుతున్న వ్యక్తికి ప్రమాదం త్రుటిలో తప్పిన ఘటన తాడికొండ మండలం కంతేరు శివారు మలుపులో జరిగింది.

వివరాల ప్రకారం తాడికొండ గ్రామానికి చెందిన యువకుడు కారుతో జాతీయ రహదారి వైపు వెళుతుండగా ఎదురుగా వస్తున్న మంగళగిరి – తాడికొండ ప్రైవేటు బస్సు బలంగా ఢీకొట్టడంతో వాహనం ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. డ్రైవర్ నిర్లక్ష్యంతో వ్యవహరించి మలుపులో వేగంగా వచ్చి ఢీకొన్న తరువాత బ్రేక్ వేశాడని, ఇంకొంచెం ముందుకొస్తే తన ప్రాణాలు పోయేవని కారు నడుపుతున్న యువకుడు ఆవేదన వ్యక్తం చేశాడు. అయితే బస్సు డ్రైవర్‌కు ఆధార్ ప్రకారం 63 సంవత్సరాలు ఉన్నాయని, అన్‌ఫిట్ అయినప్పటికీ లైసెన్సు ఎలా ఇచ్చారని, బాధితుడు తాడికొండ పోలీసుల ఎదుట వాపోయాడు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితుడు తనకు న్యాయం చేయాలని సీఐను కోరారు.



బస్సు ఢీకొట్టడంతో నుజ్జునుజ్జయిన కారు

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి



ఫిరంగిపురం: గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సర్పంచ్ మున్నంగి శివకుమారి అన్నారు. మండలంలోని వేమవరంలోని ఎంపీపీ పాఠశాలలో గురువారం విద్యార్థులకు విజన్-2030లో భాగంగా పలు అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామాణప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, నీటి సంరక్షణ, ఆరోగ్యం, ఆర్థిక వనరులు , పారిశుద్ధ్యం కోసం చర్యలు వంటి అంశాలపై పంచాయతీ కార్యదర్శి జోజప్ప అవగాహన కల్పించారు. కమిటీ చైర్మన్ జె.సుబ్బయ్య, విద్యాసెక్రటరీ వెంకటేశ్వరనాయక్, హెచ్ఎం దివి, కమల్ మోహన్, మహిళ పోలీసు యశోద, ఉపాధ్యాయుడు శేషు రవికుమార్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు ముక్కోటి ఏకాదశి ఉత్తర ద్వార దర్శనం

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి రూరల్ పెనుమాకలో పడమరవీధి ఉత్తరముఖంగా వేంచేసి యున్న శ్రీ రామాలయంలోనేడు ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారంలో దర్శమనివ్వనున్నారని ఆలయ చైర్మన్ మన్నవ అప్పాజీ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వారం నుంచి గరుడ వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమిస్తారని, భక్తులు ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకుని శంకుతీర్థాన్ని స్వీకరించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.


ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ బోధన కొనసాగించాలి

నెహ్రూనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగుతో పాటు, ఇంగ్లిష్ బోధన కూడా కొనసాగించాలని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్ డిమాండ్ చేశారు. లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం మాతృ భాష కావాలి.. అభివృద్ధి చెందడానికి ఇంగ్లిష్ బోధన కూడా అవసరమనే కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత డిసెంబర్ 28, 29 తేదీల్లో విజయవాడ కేబీఎన్ కాలేజీలో జరిగిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభల వేదికపైన విద్యావంతులు, మేధావులు, ప్రముఖ రచయితలు ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఇంగ్లిష్ మీడియం రద్దు చేయాలని కోరడం సమంజసం కాదన్నారు. జీఓ నంబర్ 85ని ఆపివేయాలని తీర్మానం చేయడమే కాకుండా ప్రభుత్వానికి కూడా విజ్ఞప్తిని పంపించడం సబబుగా లేదని తెలిపారు.ఈ తీర్మానం దళిత, బహుజన బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేసే విధంగా ఉందని తెలిపారు. తీర్మానాన్ని వెనక్కి తీసుకునేంత వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని దళిత ఉద్యమ వేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా ప్రభుదాస్ తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస ఉత్సవాలు

తాడేపల్లిరూరల్: శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ధనుర్మాస వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం మంగళగిరి బాపూజీ విద్యాలయంలో 25వ రోజు 25వ పాశురాన్ని ఆయన భక్తులకు వివరించారు. అనంతరం గోదా అమ్మవారికి అష్టోత్తరం, తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా సీతానగరం జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ 25వ రోజు నిర్వహించిన వేడుకల్లో పోరంకి, 1టౌన్, గుంటూరు, హనుమాన్ జంక్షన్ తదితర ప్రాంతాల నుంచి సుమారు 550 మంది భక్తులు గోదా అమ్మవారికి సారె సమర్పించి స్వామివారి మంగళాశాసనం అందుకున్నారని, తదుపరి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కూచిపూడి నృత్యాలు భక్తులను అలరించాయని ఆయన తెలిపారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు



కేతావత్ విష్ణు నాయక్ (ఫైల్)

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి రూరల్ పరిధిలోని పెదవడ్లపూడిలో నివాసముండే ఓ విద్యార్థి పాఠశాలకు వెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళగిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళగిరి రూరల్ ఎస్ఐ వెంకట్ తెలిపిన వివరాల ప్రకారం పెదవడ్లపూడికి చెందిన కేతావత్ విష్ణు నాయక్ స్థానికంగా ఉన్న ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడని, నెల 8వ తేదీ పాఠశాలకు వెళ్లి తిరిగి రాలేదని, జరిగిన ఈ సంఘటనపై తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, ఎవరైనా విద్యార్థి ఆచూకీ తెలిస్తే 8688831363, 9441749434, 9032555353 నెంబర్లకు సమాచారం అందించాలని ఎస్ఐ వెంకట్ తెలియజేశారు.

మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన హరికృష్ణారెడ్డి




తాడికొండ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గుంటూరు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కల్లం హరికృష్ణారెడ్డి గురువారం కలిశారు. ఈ సందర్భంగా పోలీసులు తనపై పెట్టిన అక్రమ కేసులను మాజీ సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకొచ్చారు. తప్పుడు కేసులకు భయపడవద్దని కష్ట కాలంలో పార్టీకి అండగా ఉన్నవారికి అధికారంలోకి వచ్చిన తరువాత మంచి స్థానం ఉంటుందని, జగనన్న భరోసా ఇచ్చారని హరికృష్ణారెడ్డి తెలిపారు.

అన్న క్యాంటీన్‌లో ఆకస్మిక తనిఖీ



మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి పట్టణ పరిధిలోని పాతబస్టాండ్ వద్ద వున్న అన్న క్యాంటీన్‌కు ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అనంతరం అక్కడ వున్న వారితో కలసి భోజనం చేసి నాణ్యతను పరిశీలించి అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు అన్న క్యాంటీన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన సూచించారు. అన్నక్యాంటీన్ పర్యవేక్షణాధికారి హేమమాలిని తదితరులు పాల్గొన్నారు.

నిర్మల ఫార్మసీ కళాశాలలో యువజనోత్సవాలు



మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాలలో నిర్వహిస్తున్న నిర్మల ప్లే ఆఫ్ 2025 యువజనోత్సవాలు గురువారం రెండవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సిస్టర్ జి. నిర్మల జ్యోతి మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని బుక్ హంటింగ్, త్రోబాల్, షటిల్, ఖోఖో, షాట్‌పుట్, ఫొటో బూత్ మేకింగ్ పోటీలు నిర్వహించామని, విద్యార్థులలో ఆటలు, కల్పనా శక్తిని ప్రోత్సహించేందుకు ఈ పోటీలు నిర్వహించనున్నామని అన్నారు. కార్యక్రమ సమన్వయ కర్త డాక్టర్ కె. సౌజన్య, కో–ఆర్డినేటర్లు ఆర్.రత్నమంజుల, వి.జోజిబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పాముల రెడ్డి, కళాశాల విభాగాధిపతులు డాక్టర్ హరేకృష్ణ రాయ, డాక్టర్ పద్మావతి, డాక్టర్ షేక్ ఆశా బేగం, డాక్టర్ జి.స్వప్న, డాక్టర్ షేక్ అలీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రేఖ నరేష్‌బాబు, డాక్టర్ ఆర్. నరసింహ నాయక్, తదితరులు పాల్గొన్నారు.